క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలు, భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మీర్‌పేట: విద్యార్థులకు చిన్ననాటి నుంచే ట్రాఫిక్ భద్రత, నిబంధనలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప తెలిపారు. బుధవారం మీర్‌పేట జిల్లెలగూలోని లార్డ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎల్‌బీనగర్‌లోని ట్రాఫిక్ పార్కులో ట్రాఫిక్ భద్రత-నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు బ్యాటరీతో నడిచే సైకిళ్లు, బైకులు ఇచ్చి సిగ్నల్స్‌పై శిక్షణ ఇచ్చారు. అనంతరం సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే జరిగే ప్రమాదాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మరియన్ పాల్గొన్నారు.

ఏడీజీని కలిసిన తీగల దంపతులు



మహేశ్ భగవత్‌ను కలిసిన తీగల దంపతులు

మహేశ్వరం: అడిషనల్ ఏడీజీపీ(లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్‌ను జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్ రెడ్డి దంపతులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో మహేశ్ భగవత్ రాచకొండ సీపీగా పని చేసినప్పుడు డ్రగ్స్ వాడకం వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇప్పుడు కూడా ఆర్ట్(అనితారెడ్డి తీగల) ఫౌండేషన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వాడకం, వాటి వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ఏడీజీని కోరారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో మేయర్, కార్పొరేటర్లు, పాస్టర్లు

బడంగ్‌పేట్: సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాదర్‌గుల్ ఫైత్ కమ్యూనిటీ చర్చిలో బుధవారం సంఘం కాపరులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ (బీయూపీఏ) సౌజన్యంతో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలని సూచించారు. అనంతరం క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు ఇమ్మాన్యుయేల్, శామ్యూల్, బాబురావు, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్, మనోహర్, గిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ

కడ్తాల్: అయ్యప్ప స్వామి మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలో బుధవారం గురుస్వామి భీముడు స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారణ భక్తులు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. అనంతరం భక్తజనులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

లైంగిక వేధింపులను అరికట్టాలి

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళలు, బాలికలపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చైల్డ్ చాప్టర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్ అన్నారు. మండల పరిధి ఉప్పరిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో లైంగిక వేధింపులు, వాటి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రైజ్ యువర్ వాయిస్ కామిక్ పుస్తకంలోని కథల ఆధారంగా ఈ నాటకాన్ని టీచర్స్ ద్వారా ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రదర్శన.. తమనుతాము ఎలా రక్షించుకోవాలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉందని తెలిపారు. వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని చెప్పారు.

దూరం పెరిగి.. దళారులకు చేరువై



నేల తల్లిని నమ్ముకున్న అన్నదాతలు సాగు మొదలు.. పంట చేతికి వచ్చే వరకు కంటిమీద కునుకు లేకుండా శ్రమిస్తారు. అష్టకష్టాలకోర్చి పండించిన ధాన్యాన్ని విక్రయించడానికి సైతం అంతే అవస్థలు పడుతున్నారు. స్థానికంగా మార్కెట్ యార్డు లేక నష్టాలు మూటగట్టుకుంటున్నారు. ఏటా దళారుల చేతిలో నిలువుదోపిడీకి గురవుతున్నారు.

- మద్దతు ధర పొందలేక నష్టపోతున్న రైతులు
- ఆమనగల్లుకు వెళ్లలేక.. కల్లాల్లోనే ధాన్యం విక్రయం
- కలగా మిగిలిన సబ్ మార్కెట్‌యార్డు
- సుదీర్ఘకాలంగా ఎదురు చూపులు

కడ్తాల్: వాణిజ్య, వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందుతున్న కడ్తాల్ మండల కేంద్రంలో కర్షకులు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. తాము పండించిన పంటలను నేరుగా మార్కెట్‌లో విక్రయించే అవకాశం లేక.. వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. వారు చెప్పిన ధరకే దిగుబడిని విక్రయించి.. నష్టపోతున్నారు. అప్పుడప్పుడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ.. పూర్తి స్థాయిలో ఇక్కడే నిరంతరం క్రయ విక్రయాలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాల్సి ఆవశ్యకత ఎంతైనా ఉందంటున్నారు. యార్డ్ ఏర్పాటుకు అర్హతలున్నా.. అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడం లేదని ఆరోపిస్తున్నారు.

ఆమనగల్లు మార్కెట్ దిక్కు..

స్థానికంగా మార్కెట్ యార్డు లేక.. రైతులు తమ దిగుబడిని ఆమనగల్లులో విక్రయించాల్సి వస్తుంది. కడ్తాల్ మండల పరిధి గ్రామాల నుంచి 15 నుంచి 25 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆ మార్కెట్‌కు ధాన్యం తరలించాలంటే రవాణ ఖర్చుతో ఇబ్బంది పడుతున్నారు. వ్యయప్రయాసాలకోర్చి అంత దూరం వెళ్లలేని అత్యధిక కర్షకులు.. స్థానిక వ్యాపారులు, రైస్‌మిల్లర్లకు ధాన్యాన్ని విక్రయిస్తూ నష్టపోతున్నారు.

చైర్‌పర్సన్‌పై ఆశలు

ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ కడ్తాల్ మండలానికి చెందిన వారే కావడంతో సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటుపై అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇక దిగుబడి క్రయవిక్రయాల కష్టాలు గట్టెక్కి, మార్కెట్ యార్డు కల నెరవేరనుందని పేర్కొంటున్నారు.

మద్దతు ధర అందని ద్రాక్షే



స్థానికంగా సబ్ మార్కెట్ యార్డులేక ఇబ్బంది పడుతున్నాం. ఏటా పొలాల వద్దే అరకొర ధరకు దళారులకు విక్రయించి నష్టపోతున్నాం. మద్దతు ధర అందని ద్రాక్షగానే మిగిలింది. స్థానికంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే తమ కష్టానికి తగిన ఫలితం దక్కుతుంది.

– జైపాల్‌రెడ్డి, రైతు, వంపుగూడ

రైతుల శ్రేయస్సు కోసం..



రైతులు తమ దిగుబడిని సుదూర ప్రాంతాలకు వెళ్లి విక్రయించుకోలేకపోతున్నారు. స్థానికంగా సబ్ మార్కెట్ యార్డు నిర్వహించాలని కొన్నేళ్లుగా ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు వినతులు అందజేస్తున్నారు. కర్షకులను దృష్టిలో ఉంచుకుని స్థానికంగా మార్కెట్ ఏర్పాటు చేయాలి.

– లాయక్‌అలీ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, కడ్తాల్

ఏర్పాటుకు కృషి



వేగంగా అభివృద్ధి చెందుతున్న మండల కేంద్రంలో సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టి తీసుకెళ్తా.. ఎమ్మెల్యే సహకారంతో సబ్ మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తా.

– యాట గీత, చైర్‌పర్సన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆమనగల్లు

మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ నర్సింహ

కందుకూరు: మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యతని ఎంఈఓ నర్సింహ, ప్రజ్వల సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ్‌కృష్ణ అన్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓ సమావేశం హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మానవ అక్రమ రవాణా అనేది నేరపూరితమైన చర్య, అది ప్రపంచ వ్యాప్తంగా వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తుందని పేర్కొన్నారు. దీనికి పేద, మధ్య తరగతి, వలస కార్మికుల అమ్మాయిలు, మహిళలు ఎక్కువగా బలవుతున్నారని వెల్లడించారు. ఉద్యోగం, ప్రేమ పెళ్లి పేరుతో మోసం చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారన్నారు. యూనిసెఫ్ నివేదికల ప్రకారం మోసపోతున్న వాళ్లలో యుక్త వయస్సు బాలికలు ఎక్కువ మొత్తంలో ఉన్నారన్నారు. పిల్లలతో ఎక్కువ సమయం గడిపే ఉపాధ్యాయులు ఈ విషయాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఆన్‌లైన్ జాబ్స్ అంటూ సోషల్ మీడియా ద్వారా లింక్స్ పంపడం, ఫ్రెండ్‌షిప్ పేరుతో బ్లాక్‌మెయిల్ చేయడం, ఫొటోస్ మార్ఫింగ్ చేయడం వంటి వాటి ద్వారా సైబర్ ట్రాఫికింగ్ చేస్తున్నారన్నారు. ఆయా విషయాలపై అబ్బాయిలకు, ఆటో, లారీ డ్రైవర్లకు అవగాహన కల్పించాలన్నారు.మానవ అక్రమ రవా ణాను ఆదిలోనే అడ్డుకుంటే ఆడపిల్లలను రక్షించవచ్చన్నారు. ఆయా సందర్భాల్లో చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098, లేదా పోలీస్ 100, మహిళా హెల్ప్ లైన్ 181, సైబర్ హెల్ప్ లైన్ 1930లకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల తెలంగాణ కో-ఆర్డినేటర్ సురేష్‌కుమార్, సిబ్బంది అంబర్‌సింగ్, మిథాలీరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురుమ సంఘం కార్యవర్గం ఎన్నిక



కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న దశరథ

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో బుధవారం కుమార్ అధ్యక్షతన కురుమ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిష్టగోని సదానందం, సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దాల దశరథ ముఖ్య అతిథులుగా హాజరై సంఘం గుర్రంగూడ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గుర్రంగూడ అధ్యక్షుడిగా ఆర్ల శ్రీనివాస్ కురుమ, ఉపాధ్యక్షులుగా ఇమ్మిడిబాబు కురుమ, దడిగె నర్సింహ కురుమ, ప్రధాన కార్యదర్శిగా కాటి కుమార్ కురుమ, సహాయ కార్యదర్శులుగా గొరిగె సత్యనారాయణ కురుమ, రావుల భాస్కర్ కురుమ, కోశాధికారిగా ఇమ్మడి మల్లేశ్ కురుమ, సలహాదారులుగా ఆర్ల నర్సింహ, రావుల పోచయ్య, ఆర్ల శంకర్, యాదప్ప, కొముర‌య్య, రమేశ్, సత్యనారాయణ, మల్లేశ్, ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా జంగయ్య, నాగేశ్, శ్రీకాంత్, నాగేశ్, కృష్ణను ఎన్నుకున్నారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, నియామకానికి పూర్తి సహకారం అందించిన కురుమ సోదరులందరికీ ఆర్ల శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో బహిరంగ వేలం



వేలం నిర్వహిస్తున్న ఎండోమెంట్ అధికారులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో బుధవారం 2025 సంవత్సరానిగాను కొబ్బరికాయలు, ప్రసాదాలు విక్రయాలు, కొబ్బరి చిప్పలు, ఒడి బియ్యం, అమ్మవారి చీరల సేకరణకు మొదటిసారి బహిరంగ వేలంను దేవాదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాట రసవత్తరంగా జరిగింది. వేలంలో కే.నాగరాజు కొబ్బరికాయల విక్రయాలను రూ.6లక్షల 10వేలకు, జి.శేఖర్ లడ్డూ, పులిహోరను రూ.12లక్షల 15వేలకు, కొబ్బరి చిప్పల సేకరణ జి.సుభాష్ రూ.3లక్షల 51వేలకు, కే.శేఖర్ అమ్మవారి ఒడి బియ్యం సేకరణను రూ.3లక్షల 1వేయికి దక్కించుకున్నారు. వేలంలో దేవాలయానికి రూ.24లక్షల 86 వేల ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆ ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ వి.మోహన్‌రావు, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ సిబ్బంది మురళీకృష్ణ, చంద్రమోహన్, మీగడ కాశీనాథ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కే.మధుమోహన్, కౌన్సిలర్లు బి.యాదగిరిరెడ్డి, వై.శివకుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ టోర్నమెంట్ ప్రారంభం



విద్యార్థులతో కరచాలనం చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని సిరిపురం యాదయ్య స్మారక స్టేడియంలో బుధవారం సీఎం కప్ టోర్నమెంట్‌ను అధికారులు ప్రారంభించారు. ముఖ్యులుగా బడంగ్‌పేట మున్సిపల్ మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ పి.సరస్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి వారు మాట్లాడుతూ.. చదువుతో పాటు ఆటలు ముఖ్యమేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పల్లెల నుంచి ప్రపంచ స్థాయికి ఎదగాలనే మంచి ఉద్దేశంతో సీఎం కప్‌ను మొదలుపెట్టారన్నారు. అనంతరం కబడ్డీ ఆడుతున్న బాలికల జట్టుతో విచ్చేసిన ముఖ్యులు కరచాలనం చేసి బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాయకులు రాళ్లగూడం శ్రీనివాస్ రెడ్డి, జెల్ల రమేశ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, ఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ నర్సింగ్‌రావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.

నేటి నుంచి..

కందుకూరు: సీఎం కప్-2024 మండల స్థాయి క్రీడాపోటీలను మండలంలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీఓ గీత బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పరుగు పందెం, కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్, హై జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామ న్నా రు. గ్రామస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు ఈ పోటీలు నిర్వహించనున్నామన్నారు.

ఉద్యోగులకు బదిలీ సహజం

కడ్తాల్: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజమని అధికారులు, నాయకులు అన్నారు. మండల విద్యాధికారిగా పనిచేసిన సర్దార్‌సింగ్ ఇటీవల మాడ్గుల మండలానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రం బాలుర ఉన్నత పాఠశాలలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్‌సింగ్‌ను.. సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, ఎంఈఓ సత్యనారాయణలు ఘనంగా సన్మానించారు. విధి నిర్వాహణలో ఉద్యోగులకు బదిలీలు సహజమని, ఎక్కడికి వెళ్లినా.. అంకిత భావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఎంఈఓగా సర్దార్.. అద్భుతంగా పనిచేసి గుర్తింపు పొందారని ప్రశంసించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు కాశీరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, హెచ్‌ఎంలు జంగయ్య, శ్రీనివాసులు, రజాక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

యాచారం: డ్రగ్స్, గంజాయిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆలంపల్లి జంగయ్య అన్నారు. మాల్ కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వాడకంతో యువత బంగారు భవిష్యత్తును కోల్పోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. నాడు పట్టణాలకే పరిమితమైన కల్చర్ నేడు పల్లెల్లోకి చొరబడిందని పేర్కొన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు కంబాలపల్లి విప్లవ్‌కుమార్, నాయకులు జాపాల శేఖర్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



వైద్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సందర్శించి వైద్యులు, రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అన్నిరకాల వైద్య పరీక్షలు, చికిత్సలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి రోగులకు నాణ్యతతో సేవలను అందిస్తామన్నారు. ఆస్పత్రిలో కేఎల్లార్ ట్రస్టు నుంచి సీబీపీ యంత్రాన్ని అందించామన్నారు. భవిష్యత్‌లో ఆస్పత్రిలో కావాల్సిన మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. డయాలసిస్ యంత్రాలు 5 నుంచి 10కి పెంచేందుకు, బ్లడ్ స్టోరేజీ ఫ్రీజర్ సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో మాట్లాడి సమస్యలను పరిష్కరించి, ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇజ్రాయేల్, కాకి ఈశ్వర్, కూన యాదయ్య, రఘుపతి, కృష్ణనాయక్, రాజునాయక్, బాల్‌రాజ్, రాఘవేందర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, యాదయ్య, వైద్యులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్, మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించి ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం వడ్డించాలన్నారు. హాస్టళ్లలో సమస్యలు తలెత్తకుండా వార్డెన్లు ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యనిస్తుందన్నారు. అనంతరం హాస్టళ్లు, మోడల్ స్కూల్‌లో డ్రైనేజీ, వాటర్, లైట్స్, ఫర్నిచర్, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు వసతులు కల్పించాని వార్డెన్లు, ఉపాధ్యాయులు కేఎల్లార్‌ను కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆమనగల్లు: ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం నియోజకవర్గ పరిధి 9 మందికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఈ పథకం ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌గౌడ్, సురేందర్ రెడ్డి, బిచ్యానాయక్, పెద్దయ్య యాదవ్, మెకానిక్ బాబా, విజయ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

తలకొండపల్లి: ప్రతి ఒక్కరూ దైవ మార్గంలో నడుచుకోవాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. మండల పరిధి చెన్నారం హనుమాన్ దేవాలయంలో బుధవారం శివ భక్తులు ఘనంగా ఇరుముడి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ స్వప్న, భాస్కర్ రెడ్డి, రమేష్ నాయక్, చందు నాయక్, శివ మాలధారులు మల్లేశ్, నరేష్, లచ్చు, శ్రీను, రేవంత్, శ్రీకాంత్, రామకృష్ణ, బుచ్చిరెడ్డి, శంకర్, సత్యనారాయణ, యాదయ్య, వెంకటయ్య, నిరంజన్, గోపి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతన అలవర్చుకోండి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే కసిరెడ్డి

మాడ్గుల: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మాడ్గుల మండలం సుద్ధపల్లి గ్రామంలో గణపతి, జ్ఞాన సరస్వతి, అభయాంజనేయ స్వామి, ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. దేవాలయ అభివృద్ధికి రూ.3 లక్షలు మంజూరు చేయడంతో పాటు అలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, నాయకులు కొండల్ రెడ్డి, నరసింహ్మ తదితరులు పాల్గొన్నారు.

లాభసాటిగా పాడి పరిశ్రమ

- గర్భకోశ వ్యాధులతో జాగ్రత్త
- పశువైద్యాధికారి విజయ్ కుమార్



మినరల్ మిక్చర్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

తలకొండపల్లి: వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను చేపట్టి, అధిక ఆదాయాన్ని పొందాలని పశువైద్యాధికారి విజయ్ కుమార్ అన్నారు. గర్భకోశ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని రైతులకు సూచించారు. పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధి బల్సులపల్లితండాలో పశువులకు గర్భకోశ వ్యాధుల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పశువులు గర్భం దాల్చని క్రమంలో వైద్య పరీక్షలు చేయించాలని చెప్పారు. చలికాలంలో అవి ఎదకు వచ్చే సమయంలో కట్టు నిలువకపోవడంతో దీర్ఘకాలికంగా చూడికి దూరంగా ఉంటాయని, పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తామని పేర్కొన్నారు. శిబిరంలో 49 పశువులకు సాధారణ చికిత్సలు, 10 పశువులకు చూడి పరీక్షలు, 24 లేగ దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. అనంతరం రైతులు మినరల్ మిక్చర్ ప్యాకట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఉమాకాంత్, అగ్నివేశు, గోపాలమిత్ర సూపర్‌వైజర్ లక్ష్మయ్య, సిబ్బంది స్వప్న, శ్రీకాంత్, అప్సర్, వినోద్‌బాబు, రాములు, సాజిద్, రైతులు పాల్గొన్నారు.

మోహన్‌బాబుపై చర్యలకు డిమాండ్

ఇబ్రహీంపట్నం: మాల ధరించిన విలేకరిపై సినీ నటుడు మోహన్‌బాబు చేసిన దాడిని అయ్యప్ప భక్తులు ఖండించారు. నిరసనగా ఇబ్రహీంపట్నంలో బుధవారం గోపాల్ గురుస్వామి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అయ్యప్ప స్వాములపై అడపాదడపా దాడులు జరుగుతున్నాయని తెలిపారు. అయినా పోలీసులు సంబంధిత వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కుటుంబ గొడవలను సరిచేసుకోలేని మోహన్‌బాబు.. విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయుడిపై దాడి చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. నటుడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.